(సమగ్ర తెలుగు డిజిటల్ దినపత్రిక)

# ప్రజావేదిక

PRAJA VEDIKA TELUGU DAILY




తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 4 సంచిక : 228 (కాంప్లిమెంటరీ కాపీ) ఎడిటర్:వెంకన్న 28-05 - 2026 పేజీలు : 6 Digital Edition



## ఎండల్లో జాగ్రత్త

న్యూఢిల్లీ, మే 27: దేశంలో ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు సాధ్యమైనంత వరకు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ప్రధాని మోదీ సూచించారు. ఈ మేరకు 'ఎక్స్'లో బుధవారం వరుస పోస్టులు పెట్టారు. ప్రత్యేకించి చిన్నపిల్లలు, వృద్ధులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు ఎండలకు తీవ్రంగా ప్రభావితమవుతారని తెలిపారు. ఎండలో ఎక్కువసేపు ఉంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. 2లో

# తుమ్మిడి హెట్టిపై చర్చిద్దాం

### ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్‌లకు సాగు, తాగునీరు అవసరం

**148 మీటర్ల ఎత్తుతో ప్రయోజనం తక్కువ**
**కొంత ఎత్తు పెంచితేనే గ్రావిటీతో నీళ్లు**
**మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువే ఉంటుంది**
**ప్రజావసరాల దృష్ట్యా దీనిపై చర్చ అవసరం**
**అనుకూలమైన తేదీ ఖరారు చేయండి**
**మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌కు సీఎం రేవంత్ లేఖ**
**కనీసం 150 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మించాలని యోచిస్తున్న సర్కారు**



హైదరాబాద్:తుమ్మిడిహట్టి బ్యారేజ్ ఎత్తు, నిర్మాణంపై మహారాష్ట్రతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగు ముందుకేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు బుధవారం లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో సమావేశానికి సమయమివ్వాలనీ, అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని సీఎం కోరారు. 2లో

## రాష్ట్రంలో హింసా రాజకీయాలకు స్థానం లేదు



న్యూఢిల్లీ, మే 27 :

తెలంగాణలో హింసా రాజకీయాలకు స్థానం లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయాలని బహిరంగంగా పిలుపునివ్వడం చట్ట వ్యతిరేక చర్య అని, ప్రజల కష్టంతో నిర్మించిన సింగరేణి వంటి సంస్థలను కాలబెట్టాలని సూచించడం..



## సిద్ధరామయ్య చేతికి కులగణన నివేదిక.. కర్ణాటక రాజకీయాల్లో ప్రకంపనలు

సీఎంకు కులగణన నివేదికను సమర్పించిన వెనుకబడిన తరగతుల కమిషన్
లీకైన వివరాల ప్రకారం రాష్ట్రంలో
ముస్లిం జనాభానే అత్యధికం
వీరశైవ లింగాయత్, ఒక్కలిగ వర్గాల
కంటే ముస్లింల జనాభా ఎక్కువని వెల్లడి
రిజర్వేషన్ల విధానంపై ఈ నివేదిక
ప్రభావం చూపనున్నట్లు అంచనా

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేడు (గురువారం) రాజీనామా చేస్తారనే ఊహాగానాలు ముమ్మరంగా సాగుతున్న వేళ, రాష్ట్ర రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేయగల కీలక పరిణామం చోటుచేసుకుంది. 2లో



## చావనైనా చస్తాం భావ ప్రకటనా స్వేచ్ఛను వదులుకోం

హైదరాబాద్

చావనైనా చస్తాం..

కానీ భావ ప్రకటనా స్వేచ్ఛను వదులుకోబోమని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ స్పష్టం చేశారు. బుధవారం తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షులు పృథ్వీరాజ్ అధ్యక్షతన ఇనుపబూట్లు ఇంకెంతకాలం? అని ప్రశ్నిస్తూ హైదరాబాద్ లోని సోమాజీగూడ ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.



## హైబ్రిడ్ విధానంలో మహానాడు తొలి రోజు గ్రాండ్ సక్సెస్: చంద్రబాబు

**మహానాడు తొలిరోజు విజయవంతమైందన్న సీఎం చంద్రబాబు**
**ప్రపంచ పరిస్థితుల దృష్ట్యా హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహణ**
**వర్చువల్‌గా హాజరైన 7.50 లక్షల మంది కార్యకర్తలు**
**23 నెలల పాలనపై సమీక్ష, భవిష్యత్ లక్ష్యాల నిర్దేశం**
**స్త్రీ శక్తి, యువగళం వంటి తీర్మానాలపై చర్చ**

తెలుగుదేశం పార్టీ మహానాడు తొలిరోజు కార్యక్రమం అత్యంత విజయవంతమైందని ఏపీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధినేత చంద్రబాబు తెలిపారు. ప్రపంచ పరిస్థితుల దృష్ట్యా ఈసారి హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించిన మహానాడుకు విశేష స్పందన లభించిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.



## బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు చొరవ తీసుకోండి

న్యూఢిల్లీ, మే 27: కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసేలా కేంద్రప్రభుత్వానికి సిఫారసు చేయాలని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ సాధ్వి నిరంజన్ జ్యోతికి బీజేపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. 2లో



## త్వరలోనే ఆర్టీసీ గుర్తింపు సంఘానికి ఎన్నికలు

ఆర్టీసీ గుర్తింపు సంఘానికి త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్ష?మ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆ తర్వాత ఎన్నికైన సంఘంతో కలిసి ఆర్టీసీ విలీన ప్రక్రియను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. కాలుష్య రహిత రవాణాయే లక్ష్యంగా ఈవీ బస్సులు ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. 2లో

# తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పై చర్చిద్దాం

హైదరాబాద్:
తుమ్మిడిహట్టి బ్యారేజ్ ఎత్తు, నిర్మాణంపై మహారాష్ట్రతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగు ముందుకేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు బుధవారం లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో సమావేశానికి సమయమివ్వాలనీ, అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని సీఎం కోరారు. 'ప్రాణహిత--చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్ట్‌లో భాగంగా తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మించాల్సి ఉంది. మొదటి ప్రతిపాదనలో ఈ బ్యారేజ్ 152 మీటర్ల ఎత్తు నిర్మించాలనుకున్నాం. 2016 ఆగస్టు 23న జరిగిన ఇంటర్ స్టేట్ బోర్డు సమావేశంలో తుమ్మిడిహట్టి వద్ద 148 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. అవసరమైన అనుమతులకు సహకారం అందిస్తామని కూడా అప్పట్లో తెలిపింది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఈ అంశాన్ని పున: సమీక్షించింది. 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ ఉత్తర తెలంగాణ నీటి అవసరాలకు సరిపోదని నిపుణుల సూచనలతో అంచనాకు వచ్చింది. అందుకే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని బ్యారేజీ ఎత్తుపై మరోసారి చర్చ అవసరమని తెలంగాణ భావిస్తోంది.

కావున ఈ అంశంపై రెండు రాష్ట్రాలు చర్చించి తగు నిర్ణయం తీసుకునేందుకు సమావేశం ఏర్పాటుకు సమయం ఇవ్వండి' అని రేవంత్‌రెడ్డి లేఖలో కోరారు.

# రాష్ట్రంలో హింసా రాజకీయాలకు స్థానం లేదు

న్యూఢిల్లీ, మే 27 :
తెలంగాణలో హింసా రాజకీయాలకు స్థానం లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయాలని బహిరంగంగా పిలుపునివ్వడం చట్ట వ్యతిరేక చర్య అని, ప్రజల కష్టంతో నిర్మించిన సింగరేణి వంటి సంస్థలను కాలబెట్టాలని సూచించడం.. తెలంగాణను అగౌరవపర్చడమేనని, తెలంగాణ ఆర్థిక వ్యవస్థపై దాడి చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిలిటెంట్ యాక్టివిటీ చేయాలంటూ బీఆర్ఎస్ నాయకుడు చేసిన వ్యాఖ్యలు అత్యంత ప్రమాదకరమైనవని.. బాల్క సుమన్‌ను ఉద్దేశించి ఒక ప్రకటనలో మండిపడ్డారు. సదరు వ్యాఖ్యలపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. యువతను రెచ్చగొట్టడం ద్వారా సమాజాన్ని అశాంతి వైపు నెట్టే కుట్ర జరుగుతోందని ధ్వజమెత్తారు. ఈ ఘటన.. బీఆర్ఎస్ రాజకీయ స్వభావాన్ని బయటపెట్టిందని విమర్శించారు. అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎ?సలో అసహనం పెరిగిపోతోందని వ్యాఖ్యానించారు. సమాజంలో భయాందోళనలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. బాధ్యతారహితంగా వ్యవహరించే నాయకులను, సమాజంలో అశాంతి సృష్టించే పార్టీలను ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో శాంతి, అభివృద్ధి, బాధ్యతాయుత రాజకీయాల కోసం బీజేపీ నిబద్ధతతో పని చేస్తోందని తెలిపారు. జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ కూడా బీఆర్ఎస్ మాదిరే రెచ్చగొట్టే రాజకీయాలకు కేంద్రబిందువుగా మారిందని ఆరోపించారు.

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అనేక సందర్భాల్లో ప్రధాని మోదీ పట్ల, రాజ్యాంగ వ్యవస్థల పట్ల అవమానకరంగా మాట్లాడారని గుర్తు చేశారు. విదేశాల్లోనూ రాహుల్‌గాంధీ భారత వ్యతిరేక ప్రసంగాలు చేశారని, మణిపూర్‌కు వెళ్లి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని తెలిపారు. అధికారంలో ఉన్నన్ని రోజులు దేశంలో మతపరమైన అల్లర్లకు కారణమైన కాంగ్రెస్.. ఇప్పుడు ప్రజలు సామరస్యంగా వ్యవహరిస్తుండడాన్ని జీర్ణించుకోలేకపోతోందని ఎద్దేవా చేశారు. కాగా, సింగరేణి కార్యాలయాలను తగులబెట్టాలని పిలుపునివ్వడానికి బాల్క సుమన్‌కు సిగ్గుందా? అని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ నిలదీశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆరే ఇలాంటి హింసను ప్రోత్సహించే వ్యాఖ్యలు చేయమన్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు హింసను భరించరని, ఇప్పటికైనా బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వ్యవహరించాలని హితవు పలికారు.

# సిద్ధరామయ్య చేతికి కులగణన నివేదిక.. కర్ణాటక రాజకీయాల్లో ప్రకంపనలు

**సీఎంకు కులగణన నివేదికను సమర్పించిన వెనుకబడిన తరగతుల కమిషన్**

**లీకైన వివరాల ప్రకారం రాష్ట్రంలో ముస్లిం జనాభానే అత్యధికం**

**వీరశైవ లింగాయత్, ఒక్కలిగ వర్గాల కంటే ముస్లింల జనాభా ఎక్కువని వెల్లడి**

**రిజర్వేషన్ల విధానంపై ఈ నివేదిక ప్రభావం చూపనున్నట్లు అంచనా**

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేడు (గురువారం) రాజీనామా చేస్తారనే ఊహాగానాలు ముమ్మరంగా సాగుతున్న వేళ, రాష్ట్ర రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేయగల కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎంతోకాలంగా వివాదాస్పదంగా ఉన్న 'కుల గణన' నివేదికను సిద్ధరామయ్య బుధవారం అధికారికంగా స్వీకరించారు. కర్ణాటక రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ రూపొందించిన 'సామాజిక, విద్యా సర్వే నివేదిక'ను విధాన సౌధలోని సీఎం కార్యాలయంలో కమిషన్ చైర్మన్ మధుసూదన్ ఆర్.నాయక్ ముఖ్యమంత్రికి అందజేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు శివరాజ్ తంగడగి, హెచ్.సి. మహదేవప్ప, సతీశ్ జార్కిహోళి, ఎన్. చలువరాయస్వామి తదితరులు పాల్గొన్నారు. 300 పేజీల ఈ నివేదికను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా రూపొందించామని కమిషన్ చైర్మన్ తెలిపారు. అయితే, నివేదికలోని వివరాలను ఇప్పుడే వెల్లడించలేమని ఆయన స్పష్టం చేశారు.లీకైన వివరాలతో సంచలనం

నివేదిక అధికారికంగా బయటకు రాకముందే, కొన్ని కీలక వివరాలు విశ్వసనీయ వర్గాల ద్వారా లీకయ్యాయి. ఈ సమాచారం ప్రకారం కర్ణాటక జనాభాలో ముస్లింలు 14 శాతంతో (75-80 లక్షలు) అతిపెద్ద సామాజిక వర్గంగా నిలిచారు. ఆ తర్వాత వీరశైవ-లింగాయత్‌లు 11 శాతం (60-65 లక్షలు), ఒక్కలిగలు 10 శాతం (55-60 లక్షలు), కురుబలు 8 శాతంతో (40-45 లక్షలు) తర్వాతి స్థానాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నివేదికను ప్రభుత్వం త్వరలోనే ఆమోదిస్తుందని ఆశిస్తున్నట్లు కమిషన్ పేర్కొంది. రాబోయే రోజుల్లో ఈ నివేదిక కర్ణాటక రిజర్వేషన్ల విధానంలో, రాజకీయ సమీకరణాల్లో ఎలాంటి మార్పులకు దారితీస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది

# చావనైనా చస్తాం భావ ప్రకటనా స్వేచ్ఛను వదులుకోం

హైదరాబాద్:
చావనైనా చస్తాం.. కానీ భావ ప్రకటనా స్వేచ్ఛను వదులుకోబోమని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ స్పష్టం చేశారు. బుధవారం తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షులు పృథ్వీరాజ్ అధ్యక్షతన ఇనుపబూట్లు ఇంకెంతకాలం? అని ప్రశ్నిస్తూ హైదరాబాద్ లోని సోమాజీగూడ ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాగేశ్వర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛ హరించడం సరికాదన్నారు. తాను భయపడే ప్రసక్తే లేదనీ, ఇప్పటి వరకు యాంటీసిపేటరీ బెయిల్ కోసం వెళ్లలేదనీ, వెళ్లబోనని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు తన ఇంటికి అరెస్ట్ చేసేందుకు ఎవరు రాలేదని తెలిపారు. తన మాటల్లో కులం, ప్రాంతం ప్రస్తావన లేకుండా తాను కులచిచ్చు పెట్టడానికి ప్రయత్నించానని ఆరోపించారని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాటల్లోనే కులం, ప్రాంతం ప్రస్తావన తెచ్చారని తెలిపారు. ప్రజా జీవితాన్ని అల్లకల్లోలం చేశానని ఆరోపణలు తనపై మోపారనీ, పదాలకు, ప్రకటనలకు వర్తించని సెక్షన్లు పెట్టి నవ్వు తెప్పించేలా కేసు నమోదు చేశారని తీసిపారేశారు. తాను ఆంధ్రప్రదేశ్ గురించే కాదు.... ప్రపంచంలోని అనేక దేశాలు, ప్రాంతాల గురించి మాట్లాడుతున్నానని గుర్తుచేశారు. ఆదాయం వచ్చే రైల్వే లైన్ తీసేసి విశాఖ పట్నం రైల్వే జోన్ ఇస్తే, పామర్రులో ఒఎన్జీసీ విలువైన ఆయిల్ నిక్షేపాలను కనుగొంటే దుర్మార్గ చరిత్ర



కలిగిన వేదాంతకు అప్పగిస్తే ఏపీలో ఏ ఒక్క పార్టీ అడగలేదని తప్పుపట్టారు. ఇలాంటి వంద ఉదాహరణలు తాను చెప్పగలనని అన్నారు. తనను అరెస్ట్ చేస్తారో లేక కేసులు ఉపసంహరించుకుంటారో? చేయరో? వారి ఇష్టమని తెలిపారు. దేనికైనా సిద్ధమని స్పష్టం చేశారు. ఎంత బెదిరిస్తే అంత ఎక్కువగా మాట్లాడుతామని హెచ్చరించారు. అరెస్ట్ చేసేందుకు వస్తామంటే ఎప్పుడొస్తారో చెప్పాలని సవాల్ విసిరారు.

**ఆంధ్రా పెత్తందారీతనంపై పోరాటం కొనసాగిస్తాం**

తెలంగాణలో ఆంధ్రా పెత్తందారీతనంపై తమ పోరాటం కొనసాగుతుందని పృథ్వీరాజ్ స్పష్టం చేశారు. తెలంగాణ మేధావులపై దాడి చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రెండు కండ్ల సిద్ధాంతాలను, ధృతరాష్ట్ర కౌగిలిలను నమ్మే ప్రసక్తే లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ పాలకులకు శని, ఆదివారాల్లో హైదరాబాద్ లో ఏం పని ఉంటుంది? అని ప్రశ్నించారు. అక్కడి ప్రజలు ఎన్నుకున్నది సేవ చేయడానికని గుర్తుచేశారు. ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ పై టీడీపీ, జన సేన దుష్ప్రచారాన్ని ఆపాలనీ, హెరిటేజ్ ఉత్పత్తులను బహిష్కరించాలనీ, సోర్స్ ను అడగొద్దనీ, టీడీపీ హ్యాండిల్ లో నాగేశ్వర్ పై పెట్టిన పోస్ట్ ను వెనక్కి తీసుకోవాలనీ, ఆయనపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలనీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియా సంస్థలపై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలను సమావేశం ఆమోదించింది. ఈ సమావేశంలో సంధ్య (పీఓడబ్ల్యూ), సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, సీనియర్ జర్నలిస్ట్ తులసి చందు, ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు కంభాలపల్లి కృష్ణ, జర్నలిస్టులు కాళోజీ శ్రీను, మన తొలివెలుగు రఘు తదితరులు మాట్లాడారు.

## ఎండల్లో జాగ్రత్త

న్యూఢిల్లీ, మే 27: దేశంలో ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు సాధ్యమైనంత వరకు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ప్రధాని మోదీ సూచించారు. ఈ మేరకు 'ఎక్స్'లో బుధవారం వరుస పోస్టులు పెట్టారు. ప్రత్యేకించి చిన్నపిల్లలు, వృద్ధులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు ఎండలకు తీవ్రంగా ప్రభావితమవుతారని తెలిపారు. ఎండలో ఎక్కువసేపు ఉంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం మనకు సవాలుగా మారిందని.. బయటికి వెళ్లినప్పుడు తాగునీటిని వెంట తీసుకెళ్లాలని, ఎప్పటికప్పుడు నీరు తాగుతుండాలని, అవసరమైనవారికి గ్లాసుడు మంచినీళ్లు అందించాలని సూచించారు. 'ఎండకు ప్రభావితమైనప్పుడు తలతిరగడం, వికారం, తీవ్రమైన అలసట తదితర లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయొద్దు. మీ చుట్టూ ఉన్నవారిలో ఎవరికైనా ఇలాంటి లక్షణాలు కనిపించినా వెంటనే చల్లని ప్రదేశంలోకి, లేదా నీడలోకి తరలించడం మంచిది. ఇలాంటి సందర్భాల్లో సత్వర చర్యలు అవసరం' అన్నారు.

## బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు చొరవ తీసుకోండి

న్యూఢిల్లీ, మే 27:
కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసేలా కేంద్రప్రభుత్వానికి సిఫారసు చేయాలని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ సాధ్వి నిరంజన్ జ్యోతికి బీజేపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. కేంద్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించాలని కూడా కోరారు. బీసీ నేతలతో కలిసి ఆర్.కృష్ణయ్య బుధవారం జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ సాధ్వి నిరంజన్ జ్యోతితో భేటీ అయ్యారు. పారిశ్రామిక పాలసీలలో, కాంట్రాక్టుల కేటాయింపులో బీసీలకు 50 శాతం కోటా ఇవ్వాలని కోరారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అమలు చ్టస బీసీ పథకాలకు 60 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని కోరారు. తెలుగురాష్ట్రాలు అమలు చేస్తున్న ఫీజురీయింబర్స్‌మెంట్, గురుకుల పాఠశాలలు దేశమంతా అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరగా..ఈమేరకు నిరంజన్ జ్యోతి హామీ ఇచ్చారని ఆర్.కృష్ణయ్య తెలిపారు.

## హైబ్రిడ్ విధానంలో మహానాడు తొలి రోజు గ్రాండ్ సక్సెస్: చంద్రబాబు

మహానాడు తొలిరోజు విజయవంతమైందన్న సీఎం చంద్రబాబు
ప్రపంచ పరిస్థితుల దృష్ట్యా హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహణ
వర్చువల్‌గా హాజరైన 7.50 లక్షల మంది కార్యకర్తలు
23 నెలల పాలనపై సమీక్ష, భవిష్యత్ లక్ష్యాల నిర్దేశం
స్త్రీ శక్తి, యువగళం వంటి తీర్మానాలపై చర్చ

తెలుగుదేశం పార్టీ మహానాడు తొలిరోజు కార్యక్రమం అత్యంత విజయవంతమైందని ఏపీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధినేత చంద్రబాబు తెలిపారు. ప్రపంచ పరిస్థితుల దృష్ట్యా ఈసారి హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించిన మహానాడుకు విశేష స్పందన లభించిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. తొలిరోజే సుమారు 7.50 లక్షల మంది వర్చువల్‌గా హాజరై పసుపు పండుగను జయప్రదం చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో స్పందించారు.

ప్రతి ఏటా ఒకేచోట జరిగే మహానాడును ఈసారి 1,875 క్లస్టర్లకు విస్తరించామని చంద్రబాబు వివరించారు. రికార్డులు సృష్టించడం, వాటిని తిరిగి తిరగరాయడం టీడీపీకే సాధ్యమని మరోసారి నిరూపించామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్త్రీ శక్తి, కార్యకర్తే అధినేత, యువగళం, పేదల సేవ వంటి కీలక తీర్మానాలపై చర్చించినట్లు తెలిపారు.

మహానాడు వేదికగా తమ 23 నెలల పాలనను సమీక్షించుకున్నామని, భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకున్నామని చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు. వర్చువల్ విధానంలోనూ ఇంత భారీ స్థాయిలో కార్యకర్తలు పాల్గొనడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

## త్వరలోనే ఆర్టీసీ గుర్తింపు సంఘానికి ఎన్నికలు

ఆర్టీసీ గుర్తింపు సంఘానికి త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్ష?మ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆ తర్వాత ఎన్నికైన సంఘంతో కలిసి ఆర్టీసీ విలీన ప్రక్రియను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. కాలుష్య రహిత రవాణాయే లక్ష్యంగా ఈవీ బస్సులు ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. ప్రధానంగా హైదరాబాద్ నగరంలో కాలుష్య రహిత ప్రజా రవాణాను పెంపొందించే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మరో ముందడుగు వేసిందన్నారు. గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా బుధవారం కూకట్‌పల్లి డిపోకు చెందిన 60 నూతన ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ భవిష్యత్తులో హైదరాబాద్ నగరం వాయు కాలుష్యం కోరల్లో చిక్కుకుని మరో ఢిల్లీలా మారకూడదనే ఉద్దేశంతోనే పర్యావరణ హిత ఎలక్ట్రిక్ బస్సులను పెద్ద ఎత్తున అందుబాటులోకి తెస్తున్నామని ప్రకటించారు. ప్రస్తుతం ఒక్క హైదరాబాద్‌లోనే 540 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1050 ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయని గుర్తుచేశారు.

కార్మికులకు పీఆర్సీ అమలుతో పాటు వారి సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. కార్మికుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రతి రెండో మంగళవారం ప్రత్యేకంగా సమయం కేటాయించనున్నట్టు వివరించారు. టీజీఎస్ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ ఈవీ బస్సుల విస్తరణలో భాగంగా ప్రధాన డిపోలు, బస్టాండ్లల్లో అత్యాధునిక ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలియజేశారు. శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం లేని ప్రయాణాన్ని అందిస్తున్నామన్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. సంస్థను లాభాల బాటలో నడిపిస్తూనే, ప్రయాణికులకు సురక్షితమైన, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయనీ, పర్యావరణ పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ నాగిరెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్కుమార్,కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, కలెక్టర్ మనుచౌదరి టికెట్ తీసుకుని నూతన బస్సుల్లో ప్రయాణించారు. వీరితోపాటు ఆర్టీసీ ఈడీ లు సిహెచ్.వెంకన్న, రాజశేఖర్ తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్ ను విజయవంతం చేయండి.




-నాయిని శ్రీనివాస్ రెడ్డి పిలుపు.

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,మే 27.

ఈనెల 31న హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరగనున్న తెలంగాణ ఉద్యమకారుల సదస్సును విజయవంతం చేయాలని మహబూబాబాద్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ప్రధాన కార్యదర్శి నాయిని శ్రీనివాస్ రెడ్డి బుధవారం పిలుపునిచ్చారు.కే.కేశవరావు,రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీతో ప్రత్యేక సమావేశం జరుగుతుందని అయన తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నుంచి ఉద్యమ నాయకులు,కమిటీలు,జిల్లా కమిటీలు,నియోజకవర్గ కమిటీలు, మండల బాధ్యులు ముఖ్యంగా మహిళాఉద్యమకారిణిలు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన కల్పన సునీల్ నాయక్..

బయ్యారం, ప్రజా వేదిక న్యూస్,మే 27.



బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు బిఆర్ఎస్ పార్టీ మండల నాయకురాలు కల్పనా సునీల్ నాయక్ శుభాకాంక్షలు తెలిపారు.

హజ్రత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా నిర్వహించుకునే బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు 'ఈద్ ముబారక్' అని వారు తెలిపారు.త్యాగ బుద్ధిని,నిజమైన భక్తిప్రపత్తులు కలిగి ఉన్నవారే దైవకృపకు పాత్రులు అవుతారనే సూక్తిని బక్రీద్ మనకు తెలియజేస్తుందని తెలిపారు.నేటి ఆధునిక కాలంలో సాటి మనిషిని ప్రేమించేవారే నిజమైన దైవభక్తులుగా చెప్పవచ్చునని వారు అన్నారు.హజ్రత్ ఇబ్రహీం స్ఫూర్తితో అందరూ సాటివారిని ఆదరిస్తూ సహృదయంతో ముందుకు సాగాలని 'బక్రీద్' సందర్భంగా ఆకాంక్షించారు.బక్రీద్ పండుగ సందర్భంగా ప్రవక్త ఇబ్రహీం త్యాగ నిరతిని స్మరించుకుందామని కల్పనా సునీల్ నాయక్ పిలుపునిచ్చారు.

## డీలర్లు చట్టాలకు లోబడి వ్యాపారం చేయాలి.



- మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు
ఎస్ విజయచంద్ర.మరియు చింతకాని ఏఓ వీరేందర్.

చింతకాని మే 27 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు.

డీలర్లు అందరూ విత్తన చట్టం పురుగుమందుల చట్టం ఎరువుల చట్టం లకు లోబడి వ్యాపారం చేయాలని డీలర్లకు సూచించారు. నాగులవంచ రైతు వేదికలో చింతకాని మరియు బోనకల్ మండలాల ఇన్పుట్ డీలర్లకు సమావేశం నిర్వహించారు. వానాకాలం సమీపిస్తున్న సందర్భంగా డీలర్లు అందరూ విత్తనాలను మంచి కంపెనీల నుంచి తెప్పించి రైతులకు అమ్మాలని దానికి సంబంధించిన ఇన్వాయిసులు ప్రిన్సిపాల్ సర్టిఫికెట్లు మరియు గ్రో అవుట్ రిజల్ట్స్ దగ్గర పెట్టుకోవాలని స్టాక్ రిజిస్టర్ లను ప్రతిరోజు అప్డేట్ చేయాలని డీలర్లకు సూచించారు. రైతుల ప్రయోజనార్థం రైతులకు అమ్మేటువంటి విత్తనాల గుణగణాలను రైతులకు వివరించాలని మరియు రైతులకు సరియైన రీతిలో గైడెన్స్ ఇవ్వాలని కోరారు. ప్రతి నెల 5వ తారీఖున ఫ్యామిలీలో విత్తన స్టాక్ రిపోర్టును అప్డేట్ చేయాలని ఏ డి ఏ డీలర్లకు ఆదేశించారు. ఎరువులకు సంబంధించిన ఓ ఫార్మలను లైసెన్స్ లో పొందుపరచుకోవాలని మరియు పురుగుమందులకు సంబంధించిన ప్రిన్సిపాల్ సర్టిఫికెట్లు లైసెన్స్ లో పొందుపరచుకోవాలని డీలర్లను ఆదేశించారు. ఎక్స్పైర్ స్టాక్ ఉన్నట్లయితే సపరేట్గా ఉంచి ఎక్స్పైర్ స్టాక్ నాట్ ఫర్ సేల్ అని బోర్డు పెట్టాలని డీలర్లకు సూచించారు. లైసెన్సులను కనిపించే విధంగా డిస్ప్లే చేయాలని మరియు స్టాక్ బోర్డులను ప్రతిరోజు అప్డేట్ చేయాలని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను ఎరువులను పురుగుమందులను మాత్రమే సరఫరా చేయాలని ఎవరైనా నిబంధనలను అతిక్రమించినట్లయితే వారి మీద చర్యలు తీసుకోబడుదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చింతకాని ఏవో సోములపల్లి మానస, బోనకల్ ఏవో పసునూరి వినయ్ కుమార్, ఏఈఓ కళ్యాణి మరియు తేజ పాల్గొన్నారు.

## తిర్లాపురం గ్రామంలో ఈదురుగాలుల బీభత్సం
## కరెంటు తీగలు తెగి రోడ్డు మీద పడటంవల్ల వాహనాలకు రాకపోకలు ఇబ్బందులు.

చింతకాని మే 27 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు.



చింతకాని మండల పరిధిలో తిర్లాపురం గ్రామం నుండి మత్కేపల్లి నామవరం వెళ్లే రోడ్డుకు ఈదురుగాలుల బీభత్సం-కరెంటు పోల్స్ కు ఉన్న తీగలు తెగి రోడ్డు మీద పడటంవల్ల వాహనాలకు రాకపోకలు అంతరాయం కలిగినది. రోడ్లు ఇరువైపులా ఉన్న భారీ చెట్లు విరిగి రోడ్డు మీద అడ్డంగా పడి ఉన్నాయి. దీనితో తిర్లాపురం గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈదురుగాలుల వల్ల విద్యుత్ తీగలు తెగి రోడ్లపై పడటం అత్యంత ప్రమాదకరం. ఇలాంటి పరిస్థితిలో ప్రాణాపాయం జరగకుండా ఉండటానికి తక్షణమే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు గారు తెలియపరిచారు.తెగిపడిన విద్యుత్ తీగలకు, కరెంటు స్తంభాలకు కనీసం 10 మీటర్ల దూరంలో ఉండాలి. మన గ్రామంలో, ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని తెలియపరిచారు.

## ఆధునిక భారత రూపశిల్పి పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ.

-పెద్దినేని వెంకటేశ్వరరావు

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,మే 27



భారతదేశ తొలి ప్రధానమంత్రి, ఆధునిక భారత రూపశిల్పి పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా జిల్లా కిసాన్ ప్రధాన కార్యదర్శి పెద్దినేని వెంకటేశ్వరరావు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ తొలి ప్రధానమంత్రిగా పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి భారతదేశ అభివృద్ధికి నాంది పలికారని పేర్కొన్నారు.పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు.నెహ్రూ హయాంలోనే దేశవ్యాప్తంగా అనేక ప్రాజెక్టులు నిర్మించడంతో పాటు పలు పారిశ్రామిక సంస్థలు ఏర్పాటు చేశారని తెలిపారు.ఆయన వేసిన అభివృద్ధి పునాదులే నేడు దేశం ఆర్థికంగా ముందంజలో నిలవడానికి కారణమయ్యాయని పెద్దినేని కొనియాడారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు.

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,మే 27.



బయ్యారం మండల కేంద్రానికి చెందిన సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ సీనియర్ నాయకులు మోడెం సారయ్య గత కొద్దిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ కిమ్స్ హాస్పిటల్ లో జాయిన్ అయి చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మరణించారు.వారి భౌతికకాయాన్ని కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ గుగులోత్ కిషన్ నాయక్ సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు.సారయ్య భౌతికంగా మన మధ్య లేకపోవడం చాలా బాధకరం అన్నారు.వారి కుటుంబానికి ఎల్లవేళల సహాయ సహకారాలు అందిస్తామన్నారు.ఈ నెల 25న జాతీయ కబడ్డీ క్రీడాకారుడు,రైల్వే హెడ్ కానిస్టేబుల్ మాడే రాజమల్లు మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి మనో ధైర్యాన్ని కల్పించారు.రాజమల్లు కుటుంబానికి ఎల్ల వేళల తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని కిషన్ నాయక్ అన్నారు.ఈ కార్యక్రమంలో బయ్యారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాటి జనార్ధన్, కంకటి నారాయణ,నందగిరి భద్రయ్య,నందిపాటి బవాణి,ఎనుగుల రంజిత్,తుపాకుల సతీష్,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పంట వ్యర్థాలు కాల్చొద్దు.





--రైతులకు
వ్యవసాయ శాఖ విజ్ఞప్తి..

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,మే 27.

బయ్యారం మండలం కంబాలపల్లి గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఫయాజ్,కాచనపల్లి గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి అఖిల్,కొత్తగూడెం గ్రామంలో వెంకటాపురం వ్యవసాయ విస్తరణ అధికారి తేజస్వి ఆధ్వర్యంలో సర్పంచ్ కొర్సా సుమలతతో కలిసి రైతులకు వరి మిగులు అవశేషాల దహనం, పంటల వైవిధ్యీకరణ, నానో యూరియా వినియోగంపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రైతులకు పంట అవశేషాల వలన కలిగే నష్టాలు, పంటల వైవిధ్యీకరణ అవసరం,నానో యూరియా సరైన వినియోగం వల్ల ఎరువుల ఖర్చు తగ్గడం,దిగుబడులు మెరుగుపడే అంశాలపై పూర్తిగా అవగాహన కల్పించారు.రైతులు శాస్త్రీయ,పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు.

## ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే హరిప్రియ.

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,మే 27.



ఇల్లందు మాజీ శాసనసభ్యులు బానోత్ హరిప్రియ నాయక్ నియోజకవర్గ ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.త్యాగం, ప్రేమ, భక్తికి ప్రతీక బక్రీద్ అని,అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలని అన్నారు.భక్తి శ్రద్ధలతో జరిపే అందరి ప్రార్థనలు ఫలించాలని తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్యాగానికి ప్రత్యేకగా బక్రీద్ పర్వదినాన్ని జరుపుకుంటారని గుర్తు చేశారు. త్యాగం అనురాగం దాన గుణాలను పెంపొందించే పండుగ బక్రీద్ పండుగ అని, నిస్వార్థమైన ఆత్మీయ అనుబంధాలను వ్యాప్తి చేయడమే బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశమని బక్రీద్ పండుగ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని తెలియజేస్తూ ఎక్కడ రాగద్వేషాలకు తావు లేకుండా శాంతి సామరస్యాలతో జీవించాలని ఈ యొక్క పండుగ సందేశం చాటి చెబుతుందని అన్నారు.

## బోనకల్ మండలం జర్నలిస్టులపై దాడి చేసిన వారిని సేవించిన దుండగులను వెంటనే శిక్షించాలి...



బోనకల్ మే 27 ప్రజావేదిక ప్రతినిధి

బోనకల్ వైసిపి పార్టీ బోనకల్ మండలం మాజీ అధ్యక్షుడు ఇరుగు జానేసు,బోనకల్ మండలంలో,ముగ్గురు జర్నలిస్టులపై దాడి చేసిన సేవించిన దుండగులను పోలీసులు కేసు నమోదు చేసి చేసిన వారిని సేవించిన వారిని కూడా వెంటనే శిక్షించాలని వైసిపి బోనకల్ మండల మాజీ అధ్యక్షుడు ఇరుగు జానేషు డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుపై దాడి చేసిన చేయించిన వారిని పోలీసులు అరెస్టు చేయకపోతే ప్రతిపక్ష పార్టీలు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని తెలియజేస్తున్నాం.

## చింతకాని మండలం లో ఐకెపి, విఓపి కలిసి శాంతియుతంగా నిరవధిక సమ్మె.



చింతకాని మే 27 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు.

చింతకాని మండల పరిధిలో ఐకెపి,విఓపి కలిసి చింతకాని ఎంపీడీవో కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరువాదిక సమ్మె నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా చింతకాని ఎంఆర్పి అధ్యక్షులు మరియు తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు ఈ సమ్మెకి పూర్తి మద్దతు తెలిపారు.తిర్లాపురం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.......

తెలంగాణ రాష్ట్రంలోని ఐకేపీ విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వీవోఏ) తమ సమస్యల పరిష్కారం కోసం మరోసారి సమ్మె బాట పట్టారు. గత 20 సంవత్సరాల నుండి మా గ్రామాల్లో సేవలు అందిస్తున్నామని ఈ నెల 18 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టనున్నట్టు దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో, శాంతియుత పద్ధతిలో విధులను బహిష్కరించి నిరవధిక సమ్మె చేయాలని ఐకెపి,విఓపి కలిసి ఏకగ్రీవంగా నిర్ణయించింది.వీవోఏల సమస్యల పరిషారానికై ప్రధానంగా ఆరు డిమాండ్లను ప్రభుత్వం ముందు పెట్టింది. 'వీవోఏల కనీస వేతనాన్ని రూ.20 వేలకు పెంచాలి. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, హెచ్ఆర్ పాలసీని వర్తింపజేయాలి. అర్హులైన వీవోఏలకు సీసీలుగా ఉద్యోగోన్నతి కల్పించాలి. వీవోఏలకు రూ.20 లక్షల ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి. విధి నిర్వహణ కోసం ట్యాబ్‌ల సౌకర్యం కల్పించాలి. వయోపరిమితికి సంబంధించిన జీవో నంబర్ 58ని సవరించాలి' అని కోరింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ సమస్యలను పరిషరించాలని, లేనిపక్షంలో మే 18 నుండి మా సమ్మెలో నిర్వహిస్తున్నాము. ఈ ప్రభుత్వం మా డిమాండ్ అమలయ్యే వరకు ఈ సమ్మె కొనసాగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పి. రవీంద్ర ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ, ఉపేందర్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు, జై పుల్లారావు ఎం ఎస్ పి మండల ఉపాధ్యక్షుడు వి.హరికృష్ణ, విఏలు అధ్యక్షుడు ఎం రాజు, కే మజ్ను, బి. అరుణ, సిహెచ్.నవనీత గీత సైదులు హైమారావ్, నాగరాణి, నాగమణి, సావిత్రి,ధనలక్ష్మి, తదితరులు,పాల్గొన్నారు.

# కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఓటర్ల జాబితా సవరణ పై సమీక్ష సమావేశం

కల్లూరు మే 27 ప్రజా వేదిక న్యూస్ ప్రతినిధి



సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో నిర్వహించబడుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం లో భాగంగా, ఎన్నికల ప్రక్రియకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధు లతో గౌరవ సబ్ కలెక్టర్, కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మరియు సమర్థవంతంగా నిర్వహించ బడే విధానంపై విస్తృతంగా చర్చించారు.

ఓటరు జాబితాలలో కొత్త ఓటర్ల నమోదు, మరణించిన మరియు వలస వెళ్లిన ఓటర్ల తొలగింపు, వివరాలలో మార్పులు మరియు సవరణ లు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధు లకు వివరణ ఇచ్చారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలోతమ పేరునమోదు చేసుకునేలా రాజకీయ పార్టీలు ప్రజల్లో అవగాహన కల్పించాలని సబ్ కలెక్టర్ గారు కోరారు.అదేవిధంగా, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రత్యేక సవరణ కార్యక్రమం నిర్వహించబ డుతుందని, ప్రతి దశలో రాజకీయ పార్టీల సహకారం అత్యంత అవసరమని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకతను కాపాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయగా, సంబంధిత ఎన్నికల అధికారు లు మరియు సిబ్బంది హాజరయ్యారు.

## కల్లూరు మున్సిపాలిటీలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి
## -- చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, కమిషనర్ సిహెచ్ రాజశేఖర్ పరిశీలన

కల్లూరు మే 27 ప్రజావేదిక న్యూస్ ప్రతినిధి

ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన పారిశుధ్య సేవలు అందించాలనే లక్ష్యంతో కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ రాజశేఖర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులను క్షేత్రస్థాయిలో సందర్శించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధానంగా డ్రైనేజీల పరిస్థితి, చెత్త నిల్వలు, మురుగునీటి ప్రవాహం మరియు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు.

పలు ప్రాంతాల్లో డ్రైనేజీలలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోవడం వల్ల మురుగునీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడుతున్నట్లు గుర్తించిన అధికారులు, వెంటనే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో నీటి నిల్వలు ఏర్పడకుండా, డ్రైనేజీలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా సానిటరీ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. వార్డు స్థాయిలో ప్రతిరోజూ పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని, డ్రైనేజీలలో చెత్త పేరుకుపోకుండా నిరంతరం శుభ్రపరిచే కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అలాగే ప్రజలు కూడా చెత్తను రోడ్లపై, డ్రైనేజీలలో వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు.ప్రజల ఆరోగ్యమే మున్సిపాలిటీకి ముఖ్యమని పేర్కొంటూ, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

కల్లూరు మున్సిపాలిటీని పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన పట్టణంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, కమిషనర్ సిహెచ్ రాజశేఖర్ తెలిపారు. ప్రజల సహకారంతో పారిశుధ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని వెల్లడించారు.

## టీఎంసీ ఆఫీసు దగ్గర భూమిలో నోట్ల కట్టలు.. బెంగాల్‌లో సంచలనం!

**పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ**
**కార్యాలయం సమీపంలో భారీ నగదు లభ్యం**
**భూమిలో పాతిపెట్టిన నాలుగు**
**పెద్ద సంచులలో రూ.500 నోట్ల కట్టలు**
**టీఎంసీ నేత దీపాంకర్ భట్టాచార్య అరెస్టు నేపథ్యంలో**
**కొనసాగుతున్న దర్యాప్తు**
**ప్రభుత్వ సహాయక సామగ్రి పక్కదారి పట్టించారనే ఆరోపణలు**
**నగదు విలువ కోట్లలో**
**ఉంటుందని పోలీసుల ప్రాథమిక అంచనా**



పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీకి చెందిన ఓ కార్యాలయం సమీపంలో భారీగా నగదు బయటపడటం సంచలనం సృష్టిస్తోంది. బదురియా ప్రాంతంలో భూమిలో పాతిపెట్టిన నాలుగు పెద్ద సంచులను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సంచుల్లో రూ.500 నోట్ల కట్టలు ఉన్నట్లు గుర్తించారు. దీని విలువ కోట్ల రూపాయల్లో ఉంటుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తవ్వకాలు జరపగా ఈ నగదు బయటపడింది. బదురియా మున్సిపాలిటీ చైర్మన్, టీఎంసీ సీనియర్ నేత అయిన దీపాంకర్ భట్టాచార్య అరెస్టు నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ప్రభుత్వ సహాయక సామగ్రిని పక్కదారి పట్టించారని, అక్రమాస్తులు కలిగి ఉన్నారని ఆయనపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. విపత్తు బాధితుల కోసం ఉద్దేశించిన వేలాది టార్పాలిన్లను దాచిపెట్టారనే ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ కేసులో భాగంగా గతంలో జరిపిన దాడుల్లో దాదాపు రూ.80 లక్షల నగదు, సహాయక సామగ్రిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాత్రిపూట భారీ లోడుతో వాహనాలు రావడం, పత్రాలు తగలబెట్టడం వంటి అనుమానాస్పద కార్యకలాపాలపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఈ మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న నగదును లెక్కిస్తున్నామని, దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ఈ ఘటన పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది.

## హైదరాబాద్ టెక్కీ ఇంట్లో దొంగతనం.. ఫిర్యాదు చేసిన టెక్కీపైనే సొసైటీ పెద్దల ఫైర్!

హైదరాబాద్‌లో టెక్కీ ఇంట్లో చోరీ
సీసీ కెమెరాలు పనిచేయడం లేదని వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్
సొసైటీ పరువు తీస్తున్నావంటూ టెక్కీపై నిర్వాహకుల ఆగ్రహం
పలు నగరాల్లో ఇలాంటి అనుభవాలే
ఎదురవుతున్నాయన్న నెటిజన్లు
సోషల్ మీడియాలో వైరల్ అయిన ఘటన



హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హౌసింగ్ సొసైటీలో ఓ టెక్కీకి విచిత్రమైన అనుభవం ఎదురైంది. తన ఇంట్లో దొంగతనం జరిగిందని ఫిర్యాదు చేస్తే, దానికి పరిష్కారం చూపాల్సింది పోయి, తనపైనే సొసైటీ నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌కు చెందిన శ్రవణ్ వెంకటరామన్ అనే టెక్కీ నివాసముంటున్న అపార్ట్‌మెంట్‌లో చోరీ జరిగింది. దీనిపై ఆయన రెసిడెంట్స్ వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేసి, దర్యాప్తు కోసం సీసీటీవీ ఫుటేజ్ కావాలని కోరారు. అయితే, అప్పుడే ఆసక్తికర విషయం బయటపడింది. సొసైటీలోని సెక్యూరిటీ కెమెరాలు పనిచేయడం లేదని, ఈ విషయం తమకు కూడా ఇప్పుడే తెలిసిందని మేనేజర్ సమాధానమిచ్చారు.

దీంతో అప్రమత్తమైన శ్రవణ్, భద్రతా లోపం గురించి నివాసితులను హెచ్చరిస్తూ, రక్షణ కోసం సొంతంగా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గ్రూప్‌లో సూచించారు. ఇది జరిగిన మరుసటి రోజే సొసైటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు అతడిని క్లబ్‌హౌస్‌కు పిలిపించారు. దొంగతనం గురించి చర్చించకుండా, "సొసైటీ పరువు తీస్తున్నావ్, అందరి స్థైర్యాన్ని దెబ్బతీస్తున్నావ్" అంటూ తనపై గట్టిగా అరిచారని శ్రవణ్ ఆరోపించారు.

ఈ క్రమంలో ఉపాధ్యక్షుడు, "ఈరోజు ఖరీదైన చెప్పులు పోయాయంటారు, రేపు అండర్‌వేర్ పోయిందంటారు. వాటన్నిటికీ మేం బాధ్యత తీసుకోలేం" అని నిర్లక్ష్యంగా వ్యాఖ్యానించినట్లు శ్రవణ్ తెలిపారు. వారి ప్రవర్తనతో విసిగిపోయిన ఆయన, వాట్సాప్ గ్రూప్ నుంచి బయటకు వచ్చి తన అనుభవాన్ని 'ఎక్స్'లో పంచుకున్నారు. ఈ పోస్ట్ వైరల్ అవ్వడంతో, ముంబై వంటి నగరాల్లోని అనేక మంది తాము కూడా ఇలాంటి ఇబ్బందులనే ఎదుర్కొంటున్నామని కామెంట్లు పెడుతున్నారు.